శ్రీమతి కోపూరి మాణిక్యమ్మ స్మారక కథలపోటీలో

ద్వితీయ బహుమతి పొందిన కథ...

# కథ

# వాన రావలె

డా|| కాలువ మల్లయ్య

కరకర పొద్దు పొడుస్తున్నది. మేఘాలను చీల్చుకుంటు సూర్యుడు పైకొస్తున్నడు. కిరణాల వెలుగు విశ్వమంతట విస్తరిస్తున్నది. వానాకాలం అయినా ఎండకాలం తీరుగనే ఉంది. కొంచెం పొద్దెక్కుతూనే ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉత్తర కార్తె నడుస్తుంది. అయినాపెద్దగా వానలు పడిందిలేదు.... చెర్లు, కుంటలు నిండిందీ లేదు. ఎండల్లో భూములకు పడ్డ నెర్రెలు కూడా ఇంకా పూడుకు పోలేదు. బజార్లల్ల దుబ్బ కొట్లాడుతుంది. ఆరుద్ర కార్తెలో కురిసిన రెండు మూడు వానలకు పునాస పంట వేసింద్రు.. ఆ తడికి మొలకెత్తిన మొక్కలు మాడిపోతున్నయి. చెర్లు, కుంటలు నీటి రాకకోసం ఎదురు చూస్తున్నయి. బర్రెల్లోని ఊటల్లోంచి ఏమాత్రం నీరు రావడం లేదు. వాతావరణం ఎండా కాలాన్ని తలపింపజేస్తుంది. మరి కొద్ది సేపయితే నిప్పులు చెరుగుతూ ఎండలు.

మందపెట్టిన గొర్రెలు అరుస్తున్నయి. దోమలబాధను తట్టుకోలేక అటీటు తిరుగుతున్నయి. ఒకదానికొకటి రాసుకుంటున్నయి. మందకాడి కుక్కలు నాలుక బయటపెట్టి ఒగరుకొడ్తున్నయి. మంద పక్కన పడుకున్న గొల్లబోయేలు నిద్ర లేవడానికుద్యుక్తులవుతున్నరు. తెల్లవారుజాము నుంచి కట్టె మీదనే కునుకు తీస్తున్న గంగయ్య తాత ఎప్పుడో నిద్రలేచిండు.

"ఒరేయ్ కొంరెల్లీ- ఓరి కొంరెల్లీ- లేరా-లే-లే- పొద్దెక్కుతుంది లే- లేస ఊళ్ళెకుపో .. నేను, గట్టయ్యమంద కావలుంటం.. నువ్వింత బువ్వతిని మాకున్ను, మందకాడి కుక్కలకు చద్దులు తీసుకరా-లే- ఇంకా పండకు ..మంచిగనే పన్నవుగద... తెల్లారిజాము కావలినాదేనాయె... లే...లే..." అన్నడు కొంరయ్యనుద్దేశించి గంగయ్యతాత...

మబ్బిరునుకుంటూ లేచి నిల్చున్నడు కొంరెల్లి...

"నీయవ్వ..! తాతకునావాలేత్తు... కంటినిండ నిద్ర పోనియ్యవు...

ఎప్పటికి మందమీదధ్యాసే... లేపుడు.. లేపుడు..." అన్నడు నవ్వుకుంట కొంరెల్లి...

"ఏమోగిర్తమచ్చిందని లొల్లి పెడుతన్నవు" అన్నడు మళ్ళీ...

"ఏమోగిర్తమో నీకు తెలవదార...వానకాలం నిజమే ... కాని పొద్దంత తిర్గినా గొర్ల కడుపునింద మేత్తలేవు.. జెప్పనవోయి సద్దులు పట్టుక రాపో మందలేపుదాం" అన్నడు గంగయ్యతాత

"వానకాలమయినా గిట్ల కావట్టేంది తాత?"

"ఏం జెప్పమంటవు పిలగ... కాలమహిమ

గిప్పుడు వానకాలానికి, ఎండకాలానికి తేడ తెలిసెటట్టున్నదా? నడివాన కాలంల ఎర్రటెండలు కొట్టవట్టె...గీ ఎండలకు బతుకచ్చెటట్టున్నదా?

దుర్‌జెష్టకాలం.. కాలం నాశినెంగాను" అన్నడు గొంగడి భుజానేసుకుంటూ గంగయ్యతాత..

"ఏంది....?తాత మనుమలేమొ బాగ మాట్లాడుకుంటున్నరు...?" ఉత్తరేణి పుల్లతో పండ్లుతోముకుంట అన్నడు గట్టయ్య..

"ఏం మాట్లాడుతె ఏమున్నది గట్టయ్య.... అంత అడివికచ్చింది. మృగశిర వస్తెనే భూదేవి వచ్చబడేది. అనలేట్లె మునలెడ్లు గూడ రంకెలేసేటియి. అన్ని కార్తులు వట్టిగనే పాయె. ఉత్తర ఉరిమితె వాన తప్పకుంట వడేది..ఉరుమే వినబడ్తలేకపాయె... ఏంజెప్పెటట్టున్నది..." అన్నడు గట్టయ్య...

"అంత బ్రమ్మంగారు చెప్పినట్టే ఐతందే గంగన్న.. మనిషి కన్ను మిన్ను కానుతలేదు..సుఖాల వెంటపడి కష్టాలు తెచ్చుకుంటున్నడు.. అంత అడవి కచ్చింది.." అన్నడు గట్టయ్య..

"సుఖాలద్దంటవానె మారు.." అన్నడు కొంరెల్లి...

"సుఖాల పేరుమీద అన్నిట్ని నాశినం జేత్తెల్లమరి... అటు అడువులను నాశినం జేసిరి... ఇటు భూములను నాశినం జేసిరి... సంపాదన మోజు పెరిగె... మనిషి ఆశకు అంతున్నదా? " అన్నడు గంగయ్యతాత..

"మీ కాలంల గిట్ల లేకుండె కదా తాత?"

"అరె నీయవ్వ... గింత అధ్వాన్నమా?

వానకాలం, చలికాలం, ఎండకాలంలకు తేడానే లేకపాయె... అన్ని కాలాలల్ల ఎఱ్ఱ టెండలేనాయె... వానకాలంల నెలకు నాలుగైదు వానలు పడేటియి... వాగులు, వంకలు, చెర్లు, కుంటలు పొంగి పొర్లేటియి. చలికాలంల ఎముకలు కొరికే చలి. శనిగ చేండ్లల్ల నడుత్తంటె కాళ్ళకు మంచు తలిగి ఇర్రిర్రుమనేటియి. ఎండకాలంల ఎండలు ... ఊరిబయట కొడార్లల్ల పశువులుండేటియి. ఏ కాలంల ఆ వాతావరణముండేది. గట్లుంటె ఏ కాలంల పండేపంటలు ఆ కాలంల మంచిగ పండుతయి. గదేమన్న ఉన్నదా గిప్పుడు అంత అడవి వానాకాలం అగ్గిదునికినట్టు ఎండలు. అసలెట్ల ముసలెడ్లు రంకెలేసిందిలేదు. ఉత్తర ఉరిమింది లేదు..." అన్నడు గంగయ్యతాత.

"నిజమే తాత ఇయ్యేడు ఎట్లుంటదో, ఎట్లెల్లుతదో.. అంతా కరువు..గొర్రె మ్యాకెకు కూడ తిండి కరువయితెట్ల"

"అవు విలగ... కాని ఎవ్వలనేమనెటట్టున్నది.. రోడ్డుపడి రోడ్డు పొంట ఇండ్లుపడి గొర్రె మ్యాక తిరుగ జాగలేకుంటాయె దానికి తోడు చెర్ల కుంటలు, గుట్టలన్ని ఆక్రమించుకునిరి. పరంపోగు భూములను పట్టాలు జేసుకున్రి. మనిషి ఆశకంతేడిదిబిడ్డ .. అంత గోస కచ్చింది.."

"ఇయ్యేడు గొర్ల మ్యాతకు మన్నెం పోవల్సివచ్చెటట్టున్నదే గంగన్న... ఏ మంటవు....?"

"ఏమనటానికేముంది. తప్పెటట్టులేదు. గిప్పుడే దుబ్బ కొట్లాడుతంటె ఎండకాలం ఇంకెట్లుండాలె.. ఎనుకట మనంగా కీలక నామ సంవత్సరంల మంథిని, జనగామ దిక్కు మన్నెం పోయినం.. అటు దిక్కు పశువులకు, గొర్రెమ్యాకకు గడ్డి బాగ దొరికేది.."

"నేనటు దిక్కు చాలా సార్లు పోయచ్చిన తాత.. మనూరోల్లు బొగ్గుబాయిలల్ల పనిజేత్తున్నరుగద...! ఇవ్వుడు అటుదిక్కు గొర్రెమ్యాక తిరుగుటానికి జాగ లేకుంటయింది. కొన్నూర్లు లేనిపోయినయి..పచ్చటి భూముల్ల బొగ్గు వడి బొగ్గుడాల బొగుడలైనయి. ఎక్కడ చూసినా బొగ్గు కుప్పలు. మట్టి కుప్పలు అటుదిక్కు గూడ అడవులు నరుకుతండ్రు. వానలు తగ్గినయి."

"నిజమే కొంరెల్లి.! నేలగూడ జూసిన.. ఇదంత మనిషి మాయే నంటావె గంగన్న.?అన్నడు గట్టయ్య

" మనిషి మాయ గాకుంటేంది మరి.? మనిషిల వశిపడని స్వార్ధం పెరిగినంక ఎవ్వలేం జేత్తరు...?"

"గొర్లమంద చుట్టు తిరుగుతూ మాట్లాడు తున్నరువాళ్ళు.

గంగయ్య, గట్టయ్య గొర్లమంద లోపలి కెల్లింద్రు

తెల్లచెంబులల్ల పాలు పిండింద్రు.

పాలచెంబులను కట్టెకు తగిలించుకున్నాడు కొంరెల్లి.

అందరొక్క దగ్గర నిల్చున్నరు. మందకాడ కుక్కలు వాళ్ళదగ్గరికచ్చినయి. కుంయ్ కుంయ్ అంటూ వాళ్ళను నాకుతున్నయి.

"ఇంకా అన్నంతేలేదు బిడ్డలార. కొంచె మాగుండ్రి"

కుక్కలను నిమురుకుంట అన్నడు గంగయ్య.

"రాత్రి కుక్క మొరిగినట్టుంది." అన్నడు కొంరెల్లి

"చీకట్ల ఏదన్న జంతువును చూసిందేమొ. గా గుట్టకు తోడేల్లున్నయి" అన్నడు గట్టయ్య

" ఇంకా తోడేల్లెక్కడ పాడయినయిరా గట్టయ్య. గొర్లు, బర్లు, ఆవులు గుట్టంత పొట్టుపొట్టు తిరుగుడేనాయె "

"నేను చూసిన్నే గంగన్న. ఉన్నయింక"

కొంరెల్లి ఊరుదిక్కు నడుస్తున్నడు.

గంగయ్య, గట్టయ్య పండ్లుతోముకున్నరు. పండ్లపుల్లలు అరిగెదాక తోమింద్రు. ఒకరెనుక ఒకరెల్లి దగ్గరున్న కాలువల మొకం కడుక్కున్నరు. అక్కన్నే తానాలు చేసింద్రు- తడుకల లోపలున్న గొర్రె బొక్కెలకు పాలు తాగించి తడుకల్లోకి తోలింద్రు.

"గంగన్న! ఇయ్యేడు వానలు పడయానె....? " అన్నడు గట్టయ్య

"ఏమో నాకయితె నమ్మకం లేదు" అన్నడు గంగయ్య.

"గింత పాపిష్ఠి కాలమానె"

"అవు... బ్రమ్మంగారు చెప్పినట్టు పాపం లెక్కలేనంత పెరుగుతంది.."

"పడుసు పోరగాండ్లయితె ఆగుతనే లేరు... తల్లిదండ్రులను గూడ కానుతలేరు"

"సంపాదనమీద భ్రమ- చిన్నంతురం, పెద్దంతురం లేకుంటయింది."

"ఇంక ఊళ్ళు కొంత నయమే గంగన్న. పట్నాలల్ల నయితె ముసలోల్లను ఇంట్లుంచుకోరట ...ముసలోల్ల ఆశ్రమాలల్ల వడేసి చేతులు దులుపుకుంటున్నరట.."

"ఇగ వానలు కొట్టుమంటె ఎట్ల కొడుతయో చెప్పు చెట్టుకుకాయ భారం కాకున్నా కాయకు చెట్టు భారమైతంది."

"ఏమన్న చెప్పచ్చెటట్టున్నాదె... అగో చద్దులత్తున్నయి..."

మరి కొంచెం సేపట్లనే చద్దులగిన్నెలతో గొల్లబోయేలు మందలేపటానికచ్చింద్రు. రెండు బుర్రకాయల్లో నీల్లున్నయి.

ఇద్దరి గిన్నెల్లోనూ నూకల బియ్యపన్నమే.

"ముసలోల్లమయినా మంచి బియ్యపన్నం తినే యోగం లేకపాయె మనకు.. ఏమంటవే గంగన్న"

"కిలకు ముప్పై పెట్టి బియ్యం కొంటమా.?రెండు రూపాయిలకు కిలబియ్యం ఒక్కపూటకైతయి. గటుక కంటే ఇది నయ్యమే కద.. ఇంతకు ముందు రొండు పూటలు గటుకేనాయె"

పప్పు, తొక్కుతో అన్నం కలుపుకుంట తింటున్నరు. కొంచెం సేపట్ల తినుడయిపోయింది.

"ఇగ మందలేపాలె" అన్నడు గంగయ్య

"ఇయ్యాల రాత్తిరి మందెక్కడ పెట్టుడు"




శ్రీ సాధన సాహితీ వేదిక, మార్కాపురం ఆధ్వర్యంలో జరిగిన "నెల నెలా వెన్నెల" సభలో స్వాగత ప్రసంగం చేస్తున్న వేదిక సంచాలకులు కప్పగంతుల మధుసూదన్, వేదికపై సంస్థ కార్యదర్శి కె.వి. రమణారెడ్డి, అధ్యక్షులు ఒ.ఎ. మల్లిక్, డైరెక్టర్ జి.ఎల్. రమేష్‌బాబులు.

"రాజిరెడ్డి రాగట్ల పెట్టుదాం. ఆయినే చాలా సార్లడిగిండు. ఇయాల్ల పెడుతనని చెప్పిన" అన్నడు గంగయ్య

"వానకాలం గద రాగట్ల మందేంది?"

"ఆ...వానచ్చింది పటు.. అంత మబ్బేనాయె"

"పొద్దు గూకెవరకు ఆడికి చేరుదాం..."

"మందబత్తెం పెంచాలె" "చూద్దాంపటు..."

"మనమంటేనే అందరికగ్గువ."

"ఉష్ ... ఉష్.... జాజా....., కట్టెలతో అదిలిస్తూ మందలేపింద్రు....,

"గంగయ్య తాతా.... ఎటుపోదామియ్యాల్ల" అన్నడు లచ్చులు.

"ఎటుపోయేదేంది. ఎక్కడేమున్నది.? గుట్టకు తోలుక పోదాం.. కొంచెమంత మేత్తయి"

"వానలు సరిగ్గాలేక గుట్టమీద గూడ గడ్డి గట్ల గట్లనే ఉంది."

"పొద్దంత తింపినా కడుపులు నిండుతలెవ్వు గొర్లకు"

"పాంద్రి...తోలుక పోదాం పాంద్రి..."

"ఏం తోలుకపోవుడో ..? నడుమ కాలువడ్డం రోడ్డు వెంట ఇండ్లు- గొర్లు నడుసుటానికే ఇరుకుటంగావట్టె --గొర్రెమ్యాక తిరుగచ్చెటట్టున్నదా ఏమన్న"

"అందుకే గొర్లమందలు సగమాయె. పదిమందలు ఐదాయె. ఆ ఐదుగూడ తిరుగుటానికి జాగలేకపాయె"

"అంతేనా? ఆవుల మందలో ... ఆరువోయి రెండాయె పందులమందగూడ తగ్గె. ఎటు జూసినా అంత ఎటమటంగానె ఉంది".

"గిన్ని తగ్గినంక పంటలకు ఎరువులెట్ల తాత..?

"గీ ఎరువుల నెవ్వలడుగు తుండ్రు. అమ్మోనియాలు, యూరి యాలు, ఫాస్పేట్లు ఎరువులు కొని ఎయ్యవట్టిరి. పంటలు తియ్యవట్టిరి. మన ఎరువుల నడిగేదెవ్వలు.? అన్నడు గంగయ్య.

"వాటి తోని భూమంత పాడుగాదా తాతా?"

"గదంత ఎవ్వలు సూత్తున్నరు. ఇప్పుడయితె ఎల్లుతె ఐపాయె. పంటలు పండుతయిపాయె"

"ఏమెల్లినా మంచిగలేదు తాత.? తరతరాలకు ఉండవల్సిన భూమిని పాడుజేత్తె భవిష్యత్తుల మనుషులెట్ల బతుకాలె తాత?" అన్నడు రాజమల్లు.."

"గా మాట వినెటోల్లెవ్వలున్నరు. ఇప్పుడయితె సుఖం గుంటె, సుఖంగ ఎల్లుతె చాలనుకుంటున్నరు"

"ఏంసుఖమే గంగన్న..? ఎన్ని రోగాలు ఎన్ని రొచ్చులు.? మీరు గిన్నిరకాల రోగాలను చూసింద్రా?" అన్నడు గట్టయ్య

"మనమొకం బాగలేక అద్దం నేలకు గొడితేమత్తది.? ఎవ్వల కర్మవాళ్ళది. ఇదంత మనం జేసుకుంటున్నదే"

"అవుమరి ఎవ్వలు జేసుకుంటున్నదాళ్ళకు... రోజు రోజుకు మనుషుల నడుమ దూరాలు పెరుగవట్టె" అన్నడు రాజమల్లు.

"సరెగని ఇగ వాన పడదా తాత.?" అన్నడు కొంరెల్లి


" అంబటళ్ళయింది. గిప్పుడే ఎండెట్లెల్లిందో సూడుండ్రి. ఇదేమన్న వానకాలం లెక్కున్నదా..? ఇయ్యేడు మాదండి కరువచ్చెటట్టున్నది"

"వద్దుతాత కరువులు రావద్దు"

"వద్దంటె ఆగుతయా.? మనం చేసేదే మున్నది? చూసుకుంట ఉండుడే ... కప్పతల్లాడినా, మొక్కులు మొక్కినా విరాటపర్వం భాగోతమాడిచ్చినా, వానదేవుని పాటలు పాడిచ్చినా దేవునికి దయలేకపాయె"

"కింద మంటవెట్టి మీద నీల్లువోత్తె ఏమత్తది- మనిషే కారణం అన్నిటికి. చేనుకున్నోనికి చేసుకున్నంత"

"మంద లేపుదామిగ. దోమల బాధ కాగెటట్టులెవ్వు గొర్లు.




మందలేపింద్రు.

గుంపులుగా గొర్లు నడుస్తున్నయి. గొర్ల ముందు ఇద్దరు .. మరో ఇద్దరు నడుమ- గంగయ్య, గట్టయ్య గొర్లవెనుక నడుస్తున్నరు. ఒకటివెనుక ఒకటి గుంపులుగా ముందున్న బోయేలననుసరిస్తూ గొర్లు నడుస్తున్నయి. గొర్లు ఊరగాలువ చేరుకున్నయి. కాలువలోంచి నడవడానికి ఇబ్బంది పడుతున్నయి- కొన్ని నీల్లు తాగుతున్నయి. గొర్లు నడుస్తనే ఉన్నయి. కాలువలనుంచి నడ్సుటానికి కష్టపడుతున్నయి.

"గంగన్నా! గీ బస్సు వచ్చినంక ఎటన్న పోవుటానికి మంచి సౌకర్యమయింది నిజమేనే. కని ముల్లెలు మోసెటోల్లు, బండ్లు గట్టెటోల్లకు బతుకుదెరువు లేకుంటయిపోయింది"

"గట్ల ఎన్నో పాడయినయి గట్టయ్య. కుండలు చేసుడు, చెప్పులు గుట్టుడు గిట్ల ఎన్ని పాడయిన యని? ఒక్కొక్కటిగ వృత్తులన్ని పోవట్టె. మనం ఆగుమంటె ఏమన్న ఆగెటట్లున్నయా? మనం చూసుకుంటుండుడే"

"గంతే -బాగ పైకొస్తున్న మంటరు. ఏంపైకో కని అంత మాయోలెనే ఉంది"

గొర్లు బడిదాటి గుట్టదిక్కు నడుస్తున్నయి. పక్కనే చెరువుంది. నిండుగా ఉండవలసినచెరువు బోసిపోయింది.

"గీ చెరువే మనకు జీవనాధారం"

"చెరువునిండితె బెస్తోల్లు చేపలు పట్టు కుంటరు.. చెరువు కట్టకు ఈత చెట్లుండె. ఈతకల్లు, ఈతపండ్లమ్ముకొని కొందరు బతుకుతరు. చెరువు నీళ్ళతోని పంటలు పండుతయి. ఎంతో మందికి కూల్లు దొరుకుతయి. కని ఇయ్యేడు నిండెటట్టులేదు" అన్నడు గంగయ్యతాత.

"ఉత్తర కార్తెవరకు చెరువు నిండి మోతమోసేది.చెరువు నిండ జలుగులుండేటియి... మత్తల్లు దునికే టియి.. అలుగుల్లనుంచి, మత్తడినుంచి పడే నీల్లమోత ఊళ్ళెదాక ఇనవచ్చేది"

"ఎన్ననుకుంటె ఏంలాభంర గట్టయ్య. మొత్తంగ వానలు తగ్గినయి. ముందు ముందెట్లుంటదో ?"

"మనిషికి ఒగ ఆపేక్ష గాకపాయె"

"మనిషికి ఆశ ఉండాలెకని అత్యాశద్దు"

"అయితె ఎనుకటి కాలమే మంచిదంటావె గంగన్న"

"అనుకాని పరిస్థితులను జూత్తె అట్లనే అనిపిస్తంది. వెనుకట గింత ఇసపాత్కాలుండెనా?"

"గయినెవ్వలో చెప్పుతె విన్ననే గంగన్న. వేలు, లక్షలు ఏండ్ల నుంచి జరుగని నష్టం ఈ రెండు వందలేండ్లల్ల జరిగిందట "

"అవును మరి ప్రకృతి నాశినెం గావట్టె"

"చెరువుంజూత్తె నాకు కండ్లపొంటి నీల్ల త్తున్నయే"

"నేను పడుచోన్నయినంతవరకు చెరువెండి పోంగ చూల్లేదు"

"నేనుమాత్రం చూసిన్నా కీలక నామసంవత్సరంలనే చెరువెండిపోంగ జూసిన అప్పట్నుంచి ఓసారి ఎండుడు ఓసారి నిండుడు"

"సాదారణంగ వర్షాలు పడుతనే లేకపాయె. వాయుగుండమో, తుఫానో వస్తెతప్ప చెరువు నిండుత లేదు. వాన పడుతలేదు"

"అవుమరి. ఎంపలి చెట్లకు నిచ్చెనలేసెటోల్లు పుడుతరని బ్రమ్మంగారు చెప్పిండు గద"

"గదేనిజమైతంది"

గొర్లు గుట్ట దగ్గరకు చేరుకున్నయి- మందలనుంచి ఎవ్వరి గొర్లను వాళ్ళు వేరు చేసుకున్నరు. పెనుకలుజూసి కొన్నిట్ని వేరు చేసింద్రు ఒక్కొక్క గుంపునుఒక్క దిక్కు గుట్టకు పట్టిస్తున్నరు.

పచ్చగా ఉండవలసిన గుట్ట రాల్లు రప్పలతో ఉండుడు వాళ్ళకు బాధ కలిగిస్తున్నది.

నోటి కందిన గడ్డి పోచలను తింటూ గుట్టెక్కుతున్నయి గొర్రెలు.

"ఒక్క వానస్తె మంచిగుండు. కాని వానరాదు వానమొకం చూసుడు కష్టం గావట్టె" తనలో తాను గొణుక్కుంటున్నడు గంగయ్యతాత. ఆకాశం దిక్కు చూస్తున్నడు.

సూర్యుడు నడినెత్తిమీదికస్తున్నడు. ఎండ విపరీతంగ ఉంది. తలపై నుండి గొంగడి ముసుగేసు కున్నడు గంగయ్య. చేతిల కట్టె పట్టుకున్నడు. గొర్రెల వెంబడి మెల్లెమెల్లెగ నడుస్తున్నడు. కొంచెం సేపాగి నెత్తిమీదున్న రుమాల్లెనుంచి చుట్టదీసిండు చెకుముకి రాతితో అగ్గి రాజేసిండు చుట్టంటు పెట్టుకున్నడు. పొగ పీలుస్తున్నడు. నాలుగైదు బుక్కలు పీల్చిండోలేదో రోతచ్చింది. చుట్టందీసి అవుతల పారేసిండు.

"ఛీ నీయవ్వ పొగాకు పాడుగాను. రోత గుంది. పాడుపొగాకిచ్చిండు కోమటాయినె... ఏమన్నంటె నీకు గుంటూరు పొగాకు కావల్నా అంటడు. గదాన్ని సిగరెట్లల్ల వాడుతరని నీకు తెలువదా అంటడు. ఎవ్వలనన్న మందలించ వచ్చెటట్టున్న దానే అంతా దోపుకం దోపుకం..., తనలో తానే అనుకున్నడు

గొర్రెలు బరుకూ బరుకున గడ్డిమేస్తున్నయి.

'అబ్బ...!ఎండపాడుగాను ఎండకాలంకంటె గోరంగున్నది. వానాకాలంల ఎర్రటెండలు.. ఏంకాలంగిది..." గొణుక్కుంట అన్నడు గంగయ్య.

గొర్లుఎండకు ఒగరుకొడ్తున్నయి. మేస్తున్నయి.

గంగయ్య మనసంత వానమీదనే ఉంది.

పగటేల బోయేలు తెచ్చుకున్న బువ్వతిన్నరు.

ఎంతమేసినా గొర్రెలకు కడుపు నిండటంలేదు. గుట్టపైదాకా పోయి పొద్దు వంగంగనే కిందికి దించుతున్నరు.

"గొర్రెమ్యాక తిరుగుటానికి జాగ లేకుం టాయె ఉన్న జాగల గడ్డి లేపాయె-వాన లేపాయె-వానలే లేకుంటె గడ్డేడ పెరుగుతది. మరిగ గొర్లెట్ల బతుకాలె. గొల్లోల్లెట్ల బతుకాలె.?" అనుకున్నడు గంగయ్య

అతనికి సాన బాధుంది- దుఃఖమస్తుంది.

"వానెందుకు వస్తలేదు వానరాదా ఇగ ఎండలు మండి పోవట్టె గిట్ల కాలమయితెట్ల" అనుకుంట పరేషానయితండు గంగయ్య.

పొద్దుగూట్లో పడిబోతుంది ఊరి పశువులు ఇంటి ముఖం పట్టినయి.గొర్లు గుట్టకిందికచ్చినయి. మంద పెట్టాల్సిన రాజిరెడ్డి రాగడి దిక్కు నడుస్తున్నయి.

చీకటి పడెవరకు రాగడి చేరుకున్నయి. గొర్లన్నిటిని మందగా ఒక్కచోటికి అదిలించింద్రు. ఇద్దర్ని మందకాడుంచి మిగతా బోయేలు ఊళ్ళకెళ్ళింద్రు. గంగయ్యకూడ ఇంటికెళ్ళిండు.





240 పేజీలు వెల : రు॥150 /- లు

**నండూరి రాజగోపాల్**

**"అనంతరంగాలు"**

సాహిత్య పరామర్శ

23-11-2008 న విజయవాడలో ఆవిష్కరణ జరిగింది.
ఈ పుస్తకం కావలసినవారు రు॥ 100/-లు ఎం.ఓ.ద్వారా పంపించగలరు. పోస్టేజి ఉచితం.

మేనేజర్, చినుకు ప్రచురణలు, దత్తాస్ నయాబజార్, రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా, గాంధీనగర్, విజయవాడ - 520 003.

ఫోన్ 0866-6640595, సెల్ : 98481 32208

బువ్వతిన్నడు. నులకమంచంల కొంత సేపు ఒరిగిండు అంటెనుక లేచిండు. మందకాడున్న వాళ్ళకు బువ్వను సద్ది గట్టింద్రు. వాళ్ళింటికెళ్ళి అవ్వి తెచ్చిండు. బట్ట పేగుల కట్టిన కుక్క సద్దులను తీసుకున్నడు. మందకాడికి పొయిండు. మందకాడ ఉన్నోల్లు అన్నం తిన్నరు.కుక్కలు తిన్నయి.

చీకటి చిక్కబడుతుంది. గొర్లమంద చుట్టు తిరిగిండు గంగయ్య. దట్టంగా చీకటి.

గొర్లను కంటికి రెప్పోలె చేసుకుంటున్నడు.

గొర్రెలు కొన్ని పడుకున్నయి. కొన్ని నిల్బుండున్నయి. చిమ్మ చీకటి. మంద బయట కుక్కలు పడుకున్నయి.చిమటల చప్పుడు. దూరం నుంచి నక్కల ఊళలు మరింత దూరంలో మంటలు. మొదటి జాము నిద్ర పోయిండు గంగయ్య. చెరిసగం రాత్తిరి లేచిండు. మంద కావలున్నడు.

కట్టెబట్టుకొని నిల్బున్నడు.

'వానరావాలె వానరావాలె...;అనుకుంటున్నడు.

వానపడితే బాగుండు. ఒక్క వానపడితే బాగుండు అనుకుంటున్నడు..

"కాని అతని కోర్కె తీరడంలేదు.

వానరాదా... ఇగ రాదా ...ఎన్ని రోజులైనారాదా. అనుకుంటనే ఉన్నడు.

వానరాకడ, పానం పోకడ ఎవ్వలకు తెలువది. ఎప్పుడు పడతదో వాన. అనుకున్నడు.

మరికొంచెం సేపట్లనే మబ్బులు కమ్ముకచ్చినయి. మబ్బులు కమ్ముకస్తున్నయి. చీకటితో పాటు మబ్బులు-చీకటి మరింత దట్టమైంది.

'టప్' మని ఓ చినుకు మీద పడింది. పరవశించి పోయిండు గంగయ్య. ఉర్... ఉర్... ర్ర్ ఉరిమింది. ఉత్తర ఉరిమింది. వాన మొదలైంది. టపటప చినుకులు ధారా పాతంగా ....ధారా పాతంగా...వర్షం పడుతుంది. కుండపోతగావాన.. భూమ్యాకాశాలు ఏకమైనట్టుగావాన... ఆకాశానికి తూట్లు పడ్డట్టుగా వాన. వాన... వాన.... వాన.... ఎడతెరిపిలేకుండావాన..... భూమాత తడిసింది. నెర్రెలు నిండినయి. వాగులు పారుతున్నయి... కుంటలనిండా నీళ్ళు జలజల పారుతూ నీళ్ళు..

కర్రమీదనే నిల్బున్నడు గంగయ్య. తెల్లవారే వరకు వాన పడుతూనే ఉంది. బలబల తెల్లారిన తరువాత వాన వెలిసింది

'అబ్బ. ఏంవాన.. ఏంవాన... " అన్నడు గంగయ్య.

"ప్రకృతి తలుచుకుంటె ఎంతసేపు" అన్నడు లచ్చులు.

"అబ్బ ... పెద్దవాన గొట్టిందే" అన్నడు కొంరెల్లి.

ముగ్గురు కలిసి మందలోపలికెల్లింద్రు. గొర్రెలు శరీరాలనిండా రేగడిమట్టి... అంతా బురద...

కొన్నిగొర్లు చచ్చిపడున్నయి.

వాళ్ళగుండెలు గుబేలుమన్నయి..

గంగయ్య తన గొర్లను చూసుకున్నడు. ఇర్వై సనుగులు చనిపోయున్నయి. గంగయ్య కళ్ళ వెంట నీళ్ళు.

"వానెందుకచ్చె..గొర్లు సచ్చె." బాధపడ్తున్నరు బోయేలు.

"వానరావాలె ననుకుంటిమి.వానచ్చె.. గొర్లుసచ్చె వాన రాకున్నా బాగుండేది", ఏడ్చుకుంటూ చచ్చిన గొర్లను ఇంటికి మోస్తున్నరు గంగయ్య,బోయేలు.

---

## గడువు పొడిగింపు

## భట్టిప్రోలు నాగసుందరి స్మారక సంక్రాంతి కథానికల పోటీ

నిర్వహణ : చినుకు మాసపత్రిక

## నియమ నిబంధనలు

- పోటీల్లో గెలుపొందిన కథా రచయితలకు ప్రథమ బహుమతిగా రు. 1,116/-లు, ద్వితీయ బహుమతిగా రు. 516/-లు, తృతీయ బహుమతిగా రు. 216/-లతో పాటు జ్ఞాపిక, శాలువతో సత్కరించబడును.
- కథ నిడివి అచ్చులో ఒక పేజీకి మించరాదు.
- రచయిత వివరాలు కథపై కాకుండా వేరే కాగితంపై పొందుపరచవలెను.
- హామీపత్రం (ఈ కథ తన స్వంతరచన అని, దేనికి అనుకరణగాని, అనువాదం గాని కాదని, ఇంతవరకు ఈ కథ ప్రచురింపబడలేదని, ఏ యితర పత్రికలకు గాని, శ్రవ్య, దృశ్య మాధ్య మాలకు గాని పంపలేదని ధృవీకరణ పత్రం జత పరచాలి.)
- కథలు చేరవలసిన ముగింపుతేదీ : **15 డిశంబరు 2009**
- బహుమతి పొందిన రచయితే స్వయంగా బహుమతిని తీసుకొనవలెను. ఇతరులు అనుమతించబడరు.
- కవరుపై 'సంక్రాంతి కథానికల పోటీ'కి అని వుదహరించాలి.

**ఈ కథానికల పోటీలకు ప్రముఖ కథకులు, అనువాదకులు శ్రీ ఎల్.ఆర్. స్వామి, విశాఖపట్నం స్పాన్సర్ చేస్తున్నారు**

కథలు పంపవలసిన చిరునామా :

చినుకు మాసపత్రిక
27, 28. 3వ అంతస్థు, దత్తాస్ నయాబజార్,
రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా,
గాంధీనగర్, విజయవాడ - 520 003.
ఫోన్: 0866-6640595, సెల్ : 9848132208